ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025


పాఠం అర్థమైందా..?



మెగా పీటీఎం 2.0

పాఠం చెప్పిన సీఎం చంద్రబాబు
శ్రద్ధగా విన్న మంత్రి నారా లోకేశ్

"మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాం. ప్రపంచంలోనే చురుకైన పిల్లలుగా తయారు చేసే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. పాఠశాలలు ప్రారంభంకాగానే పుస్తకాలు, సామగ్రి అందించాం. నేను చిన్నప్పుడు ఆరు కిలోమీటర్లు నడిచి బడికి వెళ్లాను. మా అమ్మ కట్టించిన క్యారియర్ తీసుకొని వాగులు, వంకలు దాటి వెళ్లి చదువుకున్నాను. మీకు ఆ బాధలు లేవు. బస్సులో ఉచితంగా బడికి రావచ్చు. బడిలోనే నాణ్యమైన, రుచికరమైన భోజనం పెడుతున్నాం. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం తయారు చేయిస్తున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తున్నాం. మీ పిల్లల భవిష్యత్తు బాగు చేయాలని నా బిడ్డ నారా లోకేశ్ విద్యాశాఖను తీసుకున్నారు.."

- తల్లిదండ్రులనుద్దేశించి సీఎం చంద్రబాబు

"విద్యార్థుల విషయంలో గురువే కాదు.. తల్లిదండ్రులకూ బాధ్యత ఉంటుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాలి. అక్కడికి వెళ్లిన పిల్లలు తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా నాణ్యమైన విద్యను అందించాలి. ప్రభుత్వ పాఠశాల్లోనూ నోవెకెన్సీ బోర్డు పెట్టే స్థాయికి చేరుకోనులా పనిచేయాలి. ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతమైన టీచర్లు ఉన్నారు.."

- ఉపాధ్యాయులనుద్దేశించి సీఎం చంద్రబాబు


పిల్లల్ని బాగా చదివించండి.. వారి బాధ్యత మాది..


ముఖ్యమంత్రికి.. క్రమ శిక్షణతో స్వాగతం


పిల్లలతో కలిసి సీఎం చంద్రబాబు భోజనం..


గ్రీన్‌కార్డులతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, అధికారులు


ఉపాధ్యాయులకు నమస్కారం చేస్తున్న సీఎం

కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో పండుగ
బిడ్డలను బాగా చదివిస్తే మంచి రోజులు
తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి సూచన

పుట్టపర్తి/కొత్తచెరువు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి పాఠం చెప్పే మాస్టారు అయ్యారు. విద్యాశాఖ మంత్రి విద్యార్థిగా మారి, ఫస్ట్ బెంచ్‌లో కూర్చున్నారు. ఆ తరగతి గదిలో పిల్లలు ఎన్నడూ లేనంత హుషారుగా మారిపోయారు. పాఠం చక్కగా విన్నారు. అడిగిన ప్రశ్నలకు టక టకా సమాధాలు ఇచ్చారు. కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఈ అరుదైన ఘట్టానికి వేదికగా మారింది. గురు పౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ 2.0ను నిర్వహించారు. ఇందులో భాగంగా, కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి, కార్యక్రమానికి స్వయానా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చారు. ఆయన తనయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని నడిపించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సీఎం రాగానే సందడి..

పుట్టపర్తి విమానాశ్రయం నుంచి కొత్తచెరువుకు సీఎం కాన్వాయ్ చేరుకోగానే సందడి మొదలైంది. జూనియర్ కాలేజీ వద్ద నుంచి ఉన్నత పాఠశాల వరకూ ఎన్‌సీసీ కేడెట్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తూ సీఎంను సగౌరవంగా తీసుకెళ్లారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. అందరి యోగక్షేమాలు (మిగతా 6లో...)



సెల్ఫీ విత్ సన్..


చదివేస్తాం.. బాగా..!

మీ పిల్లల కోసం
సీఎం వచ్చారు
- మంత్రి లోకేశ్
6

చేరువగా.. సీఎం



గుడ్ బాయ్..







భవిత కోసం సీఎం తపన
ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు కోసం తపించే గొప్పనేత చంద్రబాబు అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. గురువారం కొత్తచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మెగా పీటీఎం-2.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. దూరదృష్టి, కార్యదక్షతకు సీఎం నిదర్శనమన్నారు. విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందన్నారు. ఇక్కడ తీసుకొచ్చిన విద్యారంగంలోని మార్పులు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలుచేసే విధంగా ఏపీ వైపు చూస్తున్నారన్నారు.


ఆత్మీయ పలకరింపు..


రత్నాకర్‌తో చర్చిస్తున్న సీఎం, విద్యాశాఖ మంత్రి


సీఎంకు పాదాభివందనం

సీమ కరువును శాశ్వతంగా
తరిమేద్దాం

- పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయండి
- దేశాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకం
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

పుట్టపర్తి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కొనుగొందామని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో గురువారం ఆయన రాష్ట్రంలోని కరువు పీడిత జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు, డైరెక్టర్ డిల్లీరావు, హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి జిల్లాల జేసీలు శివనారాయణ, నవ్య, అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ జిల్లాల్లో కరువును శాశ్వతంగా నివారించాలన్నదే కేంద్రం ముఖ్య (మిగతా 7వ పేజీలో...)

ఎప్పుడూ ఇంతేనా..?





- ఎంపీఈఓలకు రెన్యువల్ కష్టాలు!
- ప్రతి సంవత్సరం తప్పని తిప్పలు
- నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్
- సమాన పనికి సమాన వేతనం ఎప్పుడో..?

అనంతపురం అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను రెన్యువల్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి నెలా ఖరుదాకా రెన్యువల్ చేస్తూ జీవో జారీ చేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలు దాటినా 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ జీవో జారీ చేయకపోవడంతో బాధిత ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్

వ్యవసాయ శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. ఇందులో అనంత జిల్లాలో 189 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 134 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.12వేలు వేతనంతోపాటు మరో రూ.3వేలు ఇన్సెంటివ్ ఇస్తున్నారు. అయితే గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2015 సంవత్సరంలో


రైతు సేవాకేంద్రం (ఫైల్)

కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీఈఓలను ఉద్యోగంలోకి తీసుకున్నారు. అప్పట్లో ప్రతి ఏడాది సకాలంలో రెన్యువల్ జీవోను జారీ చేసేవారు. అయితే గత వైసీపీ పాలనలో ప్రతి ఏడాది నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో ఇస్తూ వచ్చారు. దీంతో ప్రతి సారి ఐదు నెలలు వేతనాలు పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరినా వారి కష్టాలు తీరలేదు. కమిషనరేట్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే జిల్లా వ్యవసాయ అధికారులతో ఎంపీఈఓల వివరాలు తెప్పించుకొని, ప్రభుత్వానికి రెన్యువల్ కోసం ఫైల్ పెట్టడంలో రాష్ట్ర కమిషనరేట్ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెన్యువల్ ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉన్నట్లు సమాచారం.

సమాన పనికి సమాన వేతనం ఇచ్చేదెన్నడో..?

అనంత జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఇందులో 126 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 180 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 12 మంది సెరికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఇందులో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 143 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 73 మంది సెరికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది చేసే విధులే (మిగతా 6లో...)

మాది రంగుల పిచ్చిలేని ప్రభుత్వం
- పెనుకొండ పీటీఎం కార్యక్రమంలో మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తమది రంగుల పిచ్చిలేని ప్రభుత్వమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యకమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత విద్యార్థులచే వారి తల్లులకు కాళ్లు మొక్కించి తల్లికివందనం కార్యక్ర మాన్ని చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి సవిత మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారమని, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆపేశారన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు 2.3కోట్ల మందితో మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల 67 లక్షల మందికి తల్లికివందనం అందించామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో రూ.2,500విలువ చేసే విద్యా సామగ్రి కిట్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందిస్తున్నామని, తల్లిదండ్రులు బాధ్యతగా విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్‌కుమార్, ఎంఈఓ చంద్రశేఖర్, నాయకులు శ్రీరాములు, ప్రసాద్, నారాయణస్వామి, ఎగువగడ్డ కృష్ణమూర్తి, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, సమీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండె చెరువు! 7లో
రెండు గ్రామాల రైతులకు దారి సమస్య

చదువే సంకల్పం..

చదువుకుంటాం: విద్యార్థులు
పిల్లలను చదివించుకుంటాం: తల్లిదండ్రులు
మెగా పీటీఎంలో అలరించిన ప్రసంగాలు
మంత్రముగ్ధుడైన సీఎం చంద్రబాబు

కొత్తచెరువు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చదువే తమ సంకల్పమని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉద్ఘాటించారు. వ్యసనాల జోలికెళ్లకుండా పెద్దలు, గురువుల పట్ల భక్తితో శ్రద్ధగా చదువుకుంటామనీ, తల్లిదండ్రుల కలలను నెరవేరుస్తామని విద్యార్థులు ఉద్ఘాటించారు. తల్లికి వందనంతో తమ పిల్లలను చదివించుకునే అవకాశం దక్కిందనీ, వారిని ఉన్నత చదువులు చదివిస్తామని తల్లిదండ్రులు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం-2.0 కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్ణయాలు విద్యాభివృద్ధికి ఎలా కారణమవుతున్నాయో, తమ జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తున్నాయోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వివరించారు. వారి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రముగ్ధుడయ్యారు. విద్యార్థి చరణ్‌తేజ్‌ను శాలువాకప్పి, సత్కరించారు. రాజకీయ నాయకులు కూడా ఇంత చక్కగా మాట్లాడరంటూ ప్రశంసించారు. విద్యార్థినులు పూజిత, అమ్మాజాన్ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

తల్లికి వందనంతో చదువుకు బాసట



నా మిత్రుడిది పేద కుటుంబం. గతంలో కుటుంబంలో ఒకరికే అమ్మఒడి రావడంతో మిగతా ఇద్దరినీ బడి మాన్పించారు. ఇపుడు అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారు. అందరికీ చదువుకునే భాగ్యం కల్పిస్తున్నారు. నాకు అందిన తల్లికి వందనం సొమ్మును వృథా చేయను. ఉన్నత చదువులు చదువుతా. సీఎం చంద్రబాబు రుణం తీర్చుకుంటా. **- చరణ్ తేజ్, 9వ తరగతి**

మీరే నాకు ఆదర్శం..



ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ రాజకీయ అనుభవం, కార్యదక్షత, పట్టుదలే నాకు ఆదర్శం. అదే స్ఫూర్తితో ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి, 963 మార్కులు సాధించా. జిల్లా టాపర్‌గా నిలిచా. అమరావతిలోని విట్ కళాశాల యాజమాన్యం ఉచిత సీటు ఇచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత చదువులు అభ్యసిస్తా.

- విట్ కళాశాలలో ఉచిత సీటు సాధించిన నవరత్న

పిల్లలను చదివించుకుంటామో.. లేదోనన్న భయం ఉండేది



ప్రస్తుతం చదువు వ్యాపారంగా మారింది. మా పిల్లలను చదివించుకుంటామో.. లేదోనన్న భయం ఉండేది. ప్రభుత్వ పాఠశాలల్లో నలుగురు పిల్లలు చదువుతున్నారు. గతంలో ఒకరికే అమ్మఒడి కింద నగదు వచ్చింది. దీంతో మిగిలిన పిల్లల చదువు కోసం అప్పు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ భయం లేదు. మా పిల్లలందరికీ రూ.13వేలు చొప్పున రూ.52 వేలు వచ్చింది. ఈ డబ్బుతో పిల్లలను చదివించుకుంటా. **- వడ్డే పద్మావతి**

పిల్లలను చదివించి.. చంద్రన్న రుణం తీర్చుకుంటా



రోజూ కూలికెళ్తేగానీ మా కుటుంబం గడవదు. నాకు నలుగురు పిల్లలున్నారు. వారిని చదివించుకోలేక ఒకరిని మాతో పాటు కూలి పనికి తీసుకెళ్తున్నాం. మిగిలిన ముగ్గురిని చదివించుకోవడానికి అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం కింద డబ్బు ఇచ్చింది. దీంతో నలుగురు పిల్లలను ఉన్నత చదువులు చదివించి, చంద్రబాబు రుణం తీర్చుకుంటాను. **-రామాంజమ్మ**

అమ్మా.. నీ మాట నెరవేరుస్తా..

వ్యసనాలకు, చెడు సావాసాల జోలికి వెళ్లను. ఉపాధ్యాయులు, మీరు చెప్పిన విధంగానే నడుచుకుంటా. పెద్దలను గౌరవిస్తూ ఉన్నతస్థాయికి ఎదుగుతానని హామీ ఇస్తున్నా. అమ్మా.. నీ మాట నెరవేరుస్తానని చంద్రన్న సాక్షిగా ప్రమాణం చేస్తున్నా.

-సాయిప్రజ్వల్, విద్యార్థి

పేదల బతుకుల్లో వెలుగులు నింపారు..

తల్లికి వందనం పేరుతో మాలాంటి పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న మహనీయుడు చంద్రన్న. గురుపౌర్ణమి రోజున చంద్రన్నను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. నా కొడుకును ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దుతా.

-భవాని



బడిలో మెగా పీసీఎం..2.0

(5వ పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. బిడ్డలను బాగా చదవించాలని, చదువుకుంటే ఉన్నతంగా ఎదుగుతారని వారికి వివరించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను పరిశీలించి, మరింత బాగా చదవాలని ప్రోత్సహించారు. వైదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం మొత్తం చదువులు, భవిష్యత్తు, ప్రభుత్వ చేయూత, సంస్కరణలు, భవిష్యత్తుపై భరోసా.. ఇవే అంశాలపై సాగింది. రాజకీయాలకు తావులేకుండా కొనసాగింది. ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. సౌకర్యాలు కల్పించే, సమస్యలను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను గురువులు తీసుకోవాలని సూచించారు. కొత్తచెరువు స్కూల్ వాతావరణాన్ని చూస్తుంటే తనకు మళ్లీ చదువుకోవాలని అనిపిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ ఉందని అన్నారు.

విద్యాదానం గొప్పది...

మంచి సమాజం కోసం అందరూ బాధ్యతాయుతంగా ముందుకు నడుద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. అన్నదానం... వస్త్ర దానం... గోదానం కన్నా... విద్యాదానం గొప్పదని సీఎం అన్నారు. అలాంటి విద్యను అందించే టీచర్లను అభినందిస్తున్నానని అన్నారు. పిల్లల్లో బాధ్యత పెరగాలని, తల్లిమీద ప్రేమ, భక్తి భావం కలిగి ఉండాలని అన్నారు. తల్లిని ఆఖరు దాకా బాగా చూసుకునేందుకే తల్లికి వందనం ఇచ్చామని అన్నారు.



అబ్దుల్ కలాం ఇంటింటికీ న్యూస్ పేపర్ వేసి, ఆ డబ్బులతో చదువుకున్నారని అన్నారు. అందుకే ఆయన మిసైల్ మ్యాన్ అయ్యారని అన్నారు. అంబేడ్కర్ వీధి దీపాల వెలుగులో చదివి, రాజ్యాంగాన్ని రచించి, రాజ్యాంగ నిర్మాతగా స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. మన పిల్లల్లోనూ చాలా శక్తి సామర్థ్యాలు ఉన్నాయని, వారి ప్రతిభను వెలికితీసి అత్యంత శక్తువంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులపై ఉందని అన్నారు.

మీకోసం.. మంచి భోజనం

సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, రుచి బాగుందని సీఎం కితాబిచ్చారు. భోజనం చేస్తూనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం ప్రతి రోజూ ఇలాగే ఉంటుందా? తాము వచ్చామని ఇలా ఉందా? అని ఆరా తీశారు. ప్రతి రోజు ఇట్లాగానే ఉంటుందని బాలికలు బదులిచ్చారు. పాఠశాలలో అందరూ భోజనం చేస్తారా..? ఇంటి నుంచి తెచ్చుకుంటారా..? అని కూడా ఆరా తీశారు. అందరూ పాఠశాలలో భోజనాన్నే తింటున్నారని విద్యార్థులు ముఖ్యమంత్రికి తెలిపారు. మధ్యాహ్న భోజనం గతంలో బాగుండేది కాదు, అందుకే సన్న బియ్యంతో వండాలని సీఎం సూచించారు.. అని మంత్రి లోకేశ్ విద్యార్థులకు తెలిపారు.

10వ తరగతి విద్యార్థులతో..

పదో తరగతి విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖాముఖీగా మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రగతి, అభిరుచులు, ప్రవర్తన, ఆరోగ్యం, హాజరు తదితర అంశాల గురించి చర్చించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులు రిహాన్ బాషా, పి.జిష్ణు ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. వారి మార్కులను అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రుతో సీఎం మాట్లాడుతూ, పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థి మణికొండ సూర్యతేజ సీఎం చంద్రబాబుపై రాసిన కవిత్వాన్ని చదివి వినిపించారు. సీఎం ఆ విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు.

మీ పిల్లల కోసం సీఎం వచ్చారు

నా కోసం అప్పట్లో నాన్న రాలేదు : మంత్రి నారా లోకేశ్



అనంతపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'నేను చదువుకునే రోజుల్లో పేరెంట్ మీట్‌కు మా నాన్న వచ్చేవారు కాదు. మా అమ్మే వచ్చేది. నా కుమారుడు దేవాన్ష్ పేరెంట్ మీట్‌కు నేను వెళ్లలేని పరిస్థితి ఉంది. నా భార్య బ్రాహ్మిణి వెళతోంది. కానీ మీ పిల్లల మీ పేరెంట్ మీట్‌కు సాక్షాత్తు సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారంటే.. పిల్లల భవిష్యత్తుపై ఆయనకు ఎంత బాధ్యత ఉందో అర్థం చేసుకోవాలి' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి అన్నారు. కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 2.0లో ఆయన ప్రసంగించారు. బయటి పాఠశాలల్లో పిల్లలను బాయిలర్ కోళ్లలాగా రూంలో కట్టేస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు ఆటలు, పాటలతోపాటు యోగా కూడా నేర్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి పది, ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండవని, కేవలం పాఠాలే చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందుకే తాము ఇచ్చిన పుస్తకాలు, బ్యాగ్‌లపై సీఎం చంద్రబాబు ఫొటో లేదని, రాజకీయ పార్టీల రంగులు లేవని అన్నారు.

పవన్ అన్న సవాల్‌ను స్వీకరిస్తున్నా...

తనకు సోదర సమానులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోటి మొక్కలు నాటాలని సవాల్ విసిరారని, తాను స్వీకరిస్తున్నానని లోకేశ్ అన్నారు. మొక్కలు పెంచడం అనేది పవిత్రమైన బాధ్యత అన్నారు. విద్యాశాఖ తీసుకున్నప్పుడు అంత కఠినమైన శాఖ నీకు అవసరమా అని కొందరు అన్నారని అన్నారు. తాను ఒక్కటే చెప్పానని, కఠినమైన శాఖ కాబట్టే విద్యా శాఖను ఇష్టంగా ఎంచుకున్నానని బదులిచ్చానని అన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం సంస్కరణలు తీసుకొచ్చేందుకు విద్యా శాఖ మంత్రిగా కృషి చేస్తున్నానని అన్నారు. సెమిస్టర్‌లవారీగా పుస్తకాల బరువును తగ్గించి, నాణ్యమైన విద్యను అందించేందుకు చొరవ చూపుతున్నామని అన్నారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని, ఆగస్టులో కొత్త టీచర్లను పాఠశాలలకు పంపిస్తామని అన్నారు. కాలం మారిందని, విలువలు పడిపోయాయని, ఇది గుర్తించిన సీఎం చంద్రబాబు విలువలతో కూడిన విద్యను అందించాలని సంకల్పించారని అన్నారు.

ముఖ్యమంత్రికి వినతులు

పుట్టపర్తిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలువురు వినతులు సమర్పించారు.

జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయాలి



రాష్ట్ర ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలోని సరైన న్యాయం జరగలేదు. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేయాలి.

- బేకరీ గంగాధర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

బలిజలను బీసీ జాబితాలో చేర్చండి

యువగళం రథసారథి నారా లోకేశ్ బలిజలను బీసీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారనీ, ఆ మేరకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలి. కాపు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్యారుణాలు అందజేయాలి. గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు శిక్షణాకేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- చింతా దామోదర్, రాయలసీమ బలిజ సంఘం ఉపాధ్యక్షుడు

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చేయూతనివ్వండి



కొత్త జిల్లాలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చేయూతనిందించాలనీ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల ఇచ్చి, గృహ నిర్మాణాలకు అవకాశం కల్పించాలి. సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ అందజేయాలి. **- జర్నలిస్టు సంఘాలు**

వడ్డెర్లకు న్యాయం చేయండి



వడ్డెర కులస్తులకు న్యాయం చేయాలి. గత ఐదేళ్లలో వడ్డెర్లకు అన్యాయం చేశారు. విద్య, ఉపాధి, సామాజిక, సంక్షేమ రంగాల్లో వివక్ష చూపారు. వడ్డెర్ల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. కార్పొరేషన్ పదవులు ఇచ్చి, న్యాయం చేయాలి.

- సిమెంట్ పోలన్న, వడ్డెర సంక్షేమ సంఘం నేత



సత్యసాయి మహా సమాధిపై పూలమాల వేస్తున్న సీఎం చంద్రబాబు

మహాసమాధిని దర్శించుకున్న సీఎం

పుట్టపర్తి రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వారితోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఉన్నారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ నవంబరులో నిర్వహించే శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి నేరుగా సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



సత్యసాయి మహా సమాధికి మంత్రి నారా లోకేశ్ ప్రణామం



హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులు

24 గంటలు.. 70వేల చదరపు మీటర్లు..

హంద్రీనీవా లైనింగ్ పనుల్లో రికార్డు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జెట్‌స్పీడ్‌తో చేస్తున్నారు. 24 గంటల్లో 70వేల చదరపు మీటర్ల సిమెంట్ కాంక్రీట్ పనులు పూర్తి చేసేందుకు ఇంజనీర్లు పనులు ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజాస్వరూప్.. రికార్డు సృష్టించే సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల గురించి వివరించారు. దీంతో సీఎం అభినందించారని ఎస్ఈ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్యాకేజీ నంబర్-1 నుంచి 7వ ప్యాకేజీ వరకు 216.3 కిలోమీటరు నుంచి 400.5 కిలోమీటరు వరకు ఆయా ప్రాంతాలతోపాటు పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో 7వేల క్యూబిక్ మీటర్ల స్టీల్ ఫైబర్ రెయిన్‌ఫోర్స్‌మెంట్ కాంక్రీట్‌తో 70వేల చదరపు మీటర్ల లైనింగ్ పనులు గురువారం ఉదయం 8 గంటలకు చేపట్టినట్లు ఎస్ఈ తెలిపారు. శుక్రవారం ఉదయానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అత్యాధునిక సాంకేతిక సహాయంతో భారీ యంత్రాలు, అధిక సంఖ్యలో కార్మికులు, ఇంజనీర్లను భాగస్వాములు చేసి ఈ రికార్డు సాధించబోతున్నామని తెలిపారు.



లైనింగ్ పనుల్లో అత్యాధునిక పరికరం

ఎప్పుడూ ఇంతేనా..?

(5వ పేజీ తరువాయి)

ఎంపీఈఓలు నిర్వర్తిస్తున్నారు. అయినా రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా వేతనం ఇవ్వడం లేదు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం సిబ్బంది నెలకు రూ.34వేల వేతనం పొందుతున్నారు. ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు ప్రోత్సాహక రుసుం రూ.3వేలు అందిస్తున్నారు. ఎంపీఈఓల పనితీరు బాగుందని వ్యవసాయ అధికారి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తేనే రూ.3వేలు ప్రోత్సాహక రుసుం అందిస్తారు. లేదంటే ఆ సొమ్ము రాదు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమానంగా పనులు చేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎంపీఈఓల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమాన వేతనం ఇవ్వాలి



రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈఓలు పని చేస్తున్నారు. వారికి నెలకు అన్ని రకాల అలవెన్స్‌లు కలిపి రూ.34వేల వేతనం ఇస్తున్నారు. గత పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు రూ.3వేలు ప్రోత్సాహక రుసుం ఇస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్ వర్తింజేసి, సమాన పనికి సమాన వేతనం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని ఎంపీఈఓలను ఆదుకోవాలి. సీఎం చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలి.

- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సకాలంలో రెన్యువల్ చేయాలి



గత ప్రభుత్వ హయాంలో నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో జారీ చేస్తూ వచ్చారు. దీంతో ఐదు నెలలపాటు వేతనాలు ఆలస్యంగా వచ్చేవి. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రెన్యువల్ జీవో జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది. గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బయట వ్యక్తులతో అప్పులు తెచ్చుకొని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఇప్పటి నుంచైనా సకాలంలో రెన్యువల్ జీవో జారీ చేసి, ప్రతి నెలా వేతనం అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. **- తిరుపతయ్య, ఎంపీఈఓల సంఘం జిల్లా కార్యదర్శి**

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- విద్యార్థులు కష్టపడి చదవాలి
- మంత్రి పయ్యావుల కేశవ్
- ఉరవకొండలో మెగా పీటీఎంకి హాజరు



విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి

ఉరవకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి మంత్రితోపాటు కలెక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.94వేలు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మెగా పీటీఎం గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు దక్కించుకునే అవకాశం ఉందన్నారు. గ్రీన్‌పాస్‌పోర్టు ద్వారా విద్యార్థులు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, ఎంఈవోలు ఈశ్వరయ్య, రమాదేవి, ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి షాషావలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు చిత్తు

నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభం



ఆంజనేయులు



రేవంత్‌రెడ్డి



అరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు బౌలర్ల ధాటికి చిత్తూరు చిత్తయింది. నాలుగోరౌండ్ సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలు గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 54 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. గిరినాథ్‌రెడ్డి (64), వినయ్‌కుమార్ (38), కమిల్ (28), దత్తారెడ్డి (25) పర్వాలేదనిపించారు. కర్నూలు బౌలర్లు ఆంజనేయులు 4, ఖానీష్ 2 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 23.3 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు బౌలర్లు అరుణ్ 5, అఖిల్ 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 45 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసింది. రేవంత్‌రెడ్డి సెంచరీ (123బంతుల్లో 10బౌండరీలు, రెండు సిక్సర్లతో 111)తో చెలరేగగా.. సుబ్రహ్మణ్యం హాఫ్ సెంచరీ (74)తో ఆకట్టుకున్నాడు.

ప్రేమ, శాంతికి కేంద్రం.. ప్రశాంతి నిలయం

- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



బాబా మహాసమాధిపై పూలమాల వేస్తున్న కేంద్రమంత్రి

పుట్టపర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రేమకు, శాంతికి కేంద్రంగా ప్రశాంతి నిలయం నిలుస్తోందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని అలంకరించి పూజలు చేశారు. విద్యార్థుల గురువందనం పేరిట భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం కేంద్రమంత్రి ప్రసంగించారు. సత్యసాయి తన ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక బోధనలతో ఎందరికో గురువుగా మారి, పూజింపబడుతున్నారన్నారు. సత్యసాయిబాబా వెలకట్టలేని సేవలను ప్రజలకు అందించారన్నారు. సత్యసాయి శివైక్యం తరువాత ట్రస్టు కొనసాగిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సత్యసాయి ప్రేమ తత్వం, సేవాసంస్థలు నిర్వహిస్తున్న సేవల గురించి వివరించారు. కేంద్రమంత్రితోపాటు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సేవాసంస్థలు ఏర్పాటు చేసిన క్రిమిసంహారక మందుల పిచికారీ యంత్రాలను 200 మంది రైతులకు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులతో కలిసి మొక్కలను నాటారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్, మంత్రి సత్యకుమార్‌లు కేంద్రమంత్రిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం ప్రముఖ గాయకుడు హరిహరన్‌బృందం సంగీత గాన కచేరి నిర్వహించింది. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టుసభ్యులు చక్రవర్తి, నాగానందం, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి గీతారెడ్డి, ఇటలీ ప్రతినిధి హీరా, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దాడి కేసులో 21 మంది అరెస్ట్



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలాపురం, కొళగానహళ్లి గ్రామాల మధ్య జరిగిన దాడి, ప్రతిదాడి ఘటనలో గురువారం 21 మందిని అరెస్ట్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. రాయదుర్గం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైలాపురం గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కొళగానహళ్లి గ్రామానికి చెందిన అనంతరాజు అనే వ్యక్తిపై దాడి జరిగిందన్నారు. ఇది రెండు గ్రామాల మధ్య వివాదంగా మారింది. ఈక్రమంలో రెండు గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా దాడులు చేసుకున్నారు. దీంతో ఐదుగురు గాయపడ్డారు. పశువుల మేతను దహనం చేశారు. కారు, రెండు మోటారు వాహనాలను ధ్వంసం చేశారు. ఇళ్లల్లో చొరబడి టీవీలు, ఫర్నిచర్‌లు ధ్వంసం చేశారు. ఈ ఘటనలకు బాధ్యులుగా భావిస్తూ కొళగానహళ్లి గ్రామానికి చెందిన 21 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. దాడిలో పాల్గొన్న మైలాపురం గ్రామానికి చెందిన మరో వర్గం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారు డిశ్చార్జ్ కాగానే అరెస్టు చేస్తామన్నారు.

సార్..! నేను సచ్చిపోతా..!

● పోలీస్ యంత్రాంగానికి యువకుడి సెల్ఫీ వీడియో

గుత్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన నామాల నారాయణస్వామి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ రైల్వే ట్రాక్‌పై నిలబడి ఓ సెల్ఫీ వీడియో తీసి జిల్లా పోలీస్ యంత్రాంగానికి పంపాడు. ఉలిక్కిపడిన పోలీసులు సమాచారాన్ని గుత్తి పోలీసులకు అందజేశారు. పోలీస్ బృందాలు అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ఆ వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయడంతో వెతకడానికి పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నారాయణస్వామి ఈసురాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతితో గతం లో ప్రేమాయణం నడిపాడు. మోసం చేయడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో నారాయణస్వామిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. తిరిగి వచ్చిన అతడు నమ్మించి గత నెలలో ప్రియురాలిని వివాహం చేసుకున్నాడు. ఆమెతో కలిసి అనంతపురంలో కాపురం పెట్టాడు. తర్వాత తన సొంతూరు రజాపురం గ్రామానికి ఆమెను తీసుకువచ్చాడు. నారాయణస్వామి కుటుంబికులు ఆ యువతితో గొడవ పడ్డారు. వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో పోలీసులు వారికి రెండు రోజుల కిందట కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయితే ఆ యువతిని వదిలించుకోవాలన్న నేపంతో నారాయణస్వామి ఈ నాటకీయ పరిణామాలకు తెరలేపినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆత్మహత్య చేసుకుంటానని పోలీసులకు సమాచారం ఇచ్చి అదృశ్యం కావడంతో అతడి కోసం రైల్వేట్రాక్ వెంట పోలీసులు గాలింపు చేపట్టారు. ఇప్పటిదాక అతడి ఆచూకీ తెలియలేదు.

హాస్టల్ రీ మోడల్..!

- రూపురేఖలు మారిన గడేకల్లు వసతి గృహం
- అధ్వానం నుంచి అద్భుతమైన సౌకర్యాలు
- మంత్రి కేశవ్ చొరవతో బాగుపడిన బాలుర హాస్టల్

విడపనకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు ఎస్సీ బాలుర హాస్టల్ రూపు రేఖలు మారాయి. గత ఏడాది ఆగస్టులో ఈ ఎస్సీ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉండలేము అంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో గత ఏడాది ఆగస్టు 17న ఇక్కడ ఉండలేము అంటూ ప్రత్యేక కథనం ప్రచురితం చేసింది. దీనికి స్పందించిన టీడీపీ నాయకులు విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి హాస్టల్ రీ మోడలింగ్‌కు రూ. 13.5లక్షలు ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టేలా చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే సమయానికి హాస్టల్‌ను రెడీ చేయించారు. మరుగు దొడ్లు, ట్రీ బెంచ్‌లు, హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు, కిటికీలు, విద్యార్థులకు కొత్త పెట్టెలు, తాగు నీటి ట్యాంక్‌లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కొళాయిలు, డ్రైనేజీలు, ఏర్పాటు చేయించారు. హాస్టల్ చుట్టూ పరిసరాలను సైతం శుభ్రం చేయించారు. హాస్టల్ రూపురేఖలు మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రూపురేఖలు మారిన ఎస్సీ హాస్టల్



విద్యార్థులు చదువుకునేందుకు చెట్ల వద్ద ఏర్పాటు చేసిన అరుగులు

భయంగా ఉండేది



గత ఏడాది ఇక్కడ హాస్టల్‌లో ఉండాలంటే భయంగా ఉండేది. హాస్టల్ మొత్తం అధ్వానంగా ఉండేది. గత ఏడాది విద్యార్థులు అందరూ కలిసి జిల్లా అధికారులు దృష్టికి హాస్టల్ పరిస్థితిని తీసుకెళ్లాం. అధికారులు స్పందించి మా హాస్టల్ రూపు రేఖలు మార్చేశారు. ఇప్పుడు మాకు ఎటువంటి ఇబ్బంది లేదు. చాలా బాగుంది.

-సాయి దర్శన్, 8వ తరగతి

సౌకర్యాలు బాగున్నాయి



గతంలో మాకు హాస్టల్‌లో సౌకర్యాలు చాలా అధ్వానంగా ఉండేవి. ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రంగులు వేసి హాస్టల్ భవనాన్ని కొత్తదానిగా తీర్చిదిద్దారు. శిథిలమైన పాత భవనాన్ని తొలగించి హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశారు. సన్నబియ్యంతో చేసిన భోజనం పెడుతున్నారు. హాస్టల్‌లో అన్ని సౌకర్యాలు చాలా బాగున్నాయి.

-పీబీ ప్రభాస్, పదో తరగతి

సీమ కరువును శాశ్వతంగా తరిమేద్దాం

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశ్యమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలిసికట్టుగా ఆలోచించి, కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో కేంద్రానికి నివేదికలు ఇవ్వాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, పరిష్కారానికి కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు, రాయలసీమ జిల్లాలో కరువు పరిస్థితి, వివిధ పంటల సాగువివరాలు, ఇరిగేషన్ అంశాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలిపారు. బుందేల్‌ఖండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు ఆర్థికసాయం ప్రకటించాలని, సీమాభివృద్ధికి సహకారమందించాలని కోరారు. సమావేశంలో రాయలసీమజిల్లా వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులే దేశానికి బలం

రైతులే దేశానికి బలమని, వారి అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. మండలంలోని పెడబల్లిలో సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన మిశ్రమ పంటను కేంద్రమంత్రి గురువారం పరిశీలించారు. వర్షాభావం వల్ల ఎండిన పంటలపై ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శన తిలకించారు. అనంతరం పెడబల్లి గ్రామ పొలాల రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమైనదన్నారు. మహిళలు పేదరికాన్ని జయించి, ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సూచించిన విధానంలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయడం శుభసూచకమన్నారు. అనంతరం శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన 53,746 ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ.437.9కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును కేంద్రంమంత్రి అందించారు. అంతకుముందు ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల స్టాల్స్‌ను కేంద్ర మంత్రి పరిశీలించి, వారిని అభినందించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, రైతు సంక్షేమ శాఖ జాతీయ జాయింట్ సెకటరీ పెర్నిదేవి, రాష్ట్ర సెర్ప్ సీఈఓ కరుణ, రాష్ట్ర అగ్రికల్చర్, మార్కెటింగ్ సహకార సంఘం చైర్మన్ విజయ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యపాల్గొన్నారు.



రైతాంగ సమస్యలపై కేంద్రమంత్రితో చర్చిస్తున్న సీఎం

కేంద్రమంత్రి దృష్టికి మామిడి రైతుల సమస్యలు

పుట్టపర్తి రూరల్: రాష్ట్రంలోని మామిడి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం తరఫున తగు సాయం చేయాలని కోరారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు గురువారం కలిశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): చిగిచెర్ల-ధర్మవరం రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మరణించాడు. ధర్మవరం జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 20 నుంచి 30 సంవత్సరాల వయసుగల వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. మృతుడి ఒంటిపై లేతనీలిరంగు టీషర్ట్, నలుపురంగు చొక్కా, ఎడమ చేతిపై నేహ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440557054, 9951325345 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కళాభివందనం

- పద్మశ్రీ చలపతిరావుకు మంత్రి పాదాభివందనం
- తోలుబొమ్మల కళకు జీవం పోశారంటూ ప్రశంసలు



చలపతిరావుకు పాదాభివందనం చేస్తున్న మంత్రి

ధర్మవరం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాదాభివందనం చేశారు. ప్రాచీన తోలుబొమ్మల కళకు జీవం పోశారని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో పర్యటించారు. తోలుబొమ్మల కళలో పేరొందని పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావు ఇంటికి వెళ్లి ఆయనను శాలువాకప్పి, పూలమాలతో సత్కరించారు. దళవాయి చలపతిరావు సాధించిన అవార్డులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. దళవాయి చలపతిరావు కళాకారుడు మాత్రమే కారనీ, భారతీయ సంస్కృతికి వారసుడన్నారు. ఆయన వంటివారు ఈ ప్రాంతంలో ఉండటం అం దరికీ గర్వ కారణమన్నారు. అలాంటి కళలు, కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, నాయకులు ఓబులేసు, శ్యామ్‌రావు, గోనుగుంట్ల భూషణ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అమరాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం రాత్రి తేనెపట్టు తీసే ప్రయత్నంలో విద్యుదాఘాతంతో తిప్పేష్ (35) మరణించాడు. పోలీసు స్టేషన్ వెనుక ఉన్న కాలనీలో చింతచెట్టులో ఉన్న తేనెపట్టును బుధవారం రాత్రి 8గంటల సమయంలో తిప్పేష్ ఇనుప కడ్డీతో తీసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఇనుప కడ్డీ విద్యుత్ వైర్లను తాకడంతో షాక్ తగిలి, తిప్పేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతడితోపాటు దాసరి గిరీష్, దాసరి మంజునాథ్ కూడా గాయపడినట్లు సమాచారం. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన పన్నుల శాఖ జేసీ, డీసీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ జిల్లా జాయింట్ కమిషనర్(జేసీ)గా ఇందుకూరి హేమ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శేషాద్రిని విజయవాడ-1 సర్కిల్‌కు బదిలీ చేసి, విజయవాడ-3 సర్కిల్‌లో పనిచేస్తున్న హేమను ఇక్కడకు నియమించారు. డిప్యూటీ కమిషనర్‌గా భాస్కరవల్లి పెనుముళ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న మురళీమనోహర్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. విజయనగరంలో పనిచేస్తున్న భాస్కరవల్లి పెనుముళను జిల్లాకు నియమించారు.

డిప్యూటీ ఎంపీడీఓలు..

అనంతపురం న్యూటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు గురువారం బాధ్యతలు చేపట్టారు. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న లీలాబాయి కంబదూరు డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌కుమార్ శింగనమల డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిసింది. అశ్వత్థనాయుడుకు ఇంకా ప్లేస్‌మెంట్ కేటాయించాల్సి ఉంది.

- గండిచెరువు నిండితే రైతులకు ఇబ్బందులే
- సోమయాజులపల్లి, వేపలకుంట రైతులకు దారి సమస్య
- దిగుబడిని పొలాల్లో వదిలేయాల్సిందే
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మాగోడు ఎవరూ పట్టించుకోరు



గండిచెరువుకు అటు వైపు మాకు వ్యవసాయ భూమి ఉంది. మేము పండించిన పంటలను చెరువు నిండితే తీసుకురావడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది. పలుమార్లు మా సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. రైతుల గోడు పట్టించుకునే నాయకులే లేకుండాపోయారు. **- రాజారెడ్డి, రైతు, వేపలకుంట**



నిండుకుండలా గండిచెరువు (ఫైల్)

గుండె చెరువు!

గాండ్లపెంట, జూలై 10(ఆంధ్రజ్యోతి): సాధారణంగా చెరువు నిండితే రైతులకు సంతోషం కలుగుతుంది. కానీ రెండు గ్రామాల రైతులకు మాత్రం ఇబ్బంది కలుగుతోంది. మండలంలోని వేపలకుంట గ్రామానికి ఆనుకుని ఉన్న గండిచెరువు నిండితే పొలాలకు వెళ్లడానికి దారి లేకుండాపోతోందని సోమయాజులపల్లి, వేపలకుంట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగర రాజుల కాలంలో నిర్మించిన గండిచెరువుకు దాదాపు 15 సంవత్సరాల కిందట మరమ్మతులు చేశారు. దీంతో ఎగువ ప్రాంతాలైన మల్లమీదపల్లి, సామచేనుబైలు, ఎన్పీకుంట మండలంలోని పలుగ్రామాల నుంచి వచ్చే వర్షపు నీరు ఈ చెరువుకు చేరి, నిల్వ ఉంటోంది. దీంతో గండిచెరువు దిగువన బోరు బావుల్లో నీరు పుష్కలంగా లభిస్తోంది. చెరువుకు అటువైపు సోమయాజులపల్లి, వేపలకుంట గ్రామాల రైతులకు చెందిన దాదాపు ఐదు వందల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. వీటిని ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్నారు. చెరువు నిండితే అవతల ఉన్న పొలాల నుంచి దిగుబడిని ఇంటికి చేర్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులు, పాలకులకు చెప్పినా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గండిచెరువుకు అటువైపు భూముల్లో వరినార్లు వేసుకుంటున్నారు. పంట కోత సమయంలో చెరువు నిండితే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు.



గ్రాసం కోసం నీటిలోనే పశువులను తీసుకెళ్తున్న రైతులు (ఫైల్)

ప్రతిపాదనలు పంపాం

గండిచెరువు నిండితే అటువైపు భూములకు రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. రోడ్డు నిర్మాణం కోసం ప్రణాళికలు తయారు చేసి ఉన్నధికారులకు పంపాం. ఉత్తర్వులు, నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతాం.

-అరుణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

ఎగువ ప్రాంతంలో రస్తా ఏర్పాటు

గండిచెరువు ఎగువప్రాంతంలో కొంతమంది రైతులు సొంతంగా రూ. లక్షలు ఖర్చు చేసి రస్తా ఏర్పాటు చేసుకున్నారు. గత పదేళ్లుగా రస్తా లేకపోవడంతో చేతికొచ్చిన పంటలను వదిలేయాల్సి దుస్థితి నెలకొంది. ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో సోమయాజులపల్లికి చెందిన జయరాం, కొండయ్య, చంద్ర తదితర రైతులు కలిసి సొంతంగా దాదాపు రూ.3లక్షలు ఖర్చు చేసి మరువ సమీపం నుంచి చెరువు కట్టమీదుగా రస్తా ఏర్పాటు చేసుకున్నారు. అయితే దిగువప్రాంత రైతుల ఈ రస్తాలో వెళ్లడానికి వీలు కాదు.

చెరువు నిండితే పంటను వదిలేయాల్సిందే

సోమయాజులపల్లి, వేపలకుంట, గ్రామాల రైతులకు గండిచెరువు అటువైపున భూములున్నాయి. చెరువుకు మరమ్మతులు చేపట్టక ముందు వేపలకుంట సమీపంలో రస్తా సౌకర్యం ఉండేది. రైతులు సాగుచేసిన పంటలను, పశుగ్రాసం, పశువులను తీసుకొచ్చేందుకు వీలుండేంది. ప్రస్తుతం చెరువు నిండితే పొలాలకెళ్లే దారి మొత్తం నీటితో మునిగిపోతోంది. దీంతో రైతుల రాకపోలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చెరువు నిండితే పంటను వదిలేయాల్సిందే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు అటువైపు వివిధరకాల పంటలు, మామిడితోటలు, కూరగాయా లు తదితరవాటిని సాగుచేస్తారు. అగ్రామాల్లో పాడి పశువులు అధికంగా ఉ న్నాయి. గ్రాసాన్ని చెరువు అటువైపు భూములనుంచి తెచ్చుకోవాల్సిందే. వర్షాకాలంలో నీటిలో వెళ్తూ గడ్డి మోపులు మోసుకుని రావాల్సి వస్తోంది. అలాగే పశువులను మేతకు తీసుకెళ్లాలంటే చెరువులోనే వెళ్లాల్సి వస్తోంది.

నకిలీ బంగారం ముఠా అరెస్టు

● హాల్ మార్క్ లేజర్ మిషన్ స్వాధీనం

గుంతకల్లుటౌన్, జూలై10(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు నగలు తయారు చేసే ముఠాను కసాపురం పోలీసులు అరెస్టు చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 39 గ్రాముల బంగారు గాజులు, 13 నకిలీ బంగారు ఉంగరాలు, రూ.లక్ష నగదు, హాల్ మార్క్ వేసే మిషన్, 200 గ్రాముల నాలుగువెండి కాలి పట్టీలు, 15గ్రాముల వెండి కడియం, 145 గ్రాముల కాపర్ తీగలు, వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టీపీ వెంకటస్వామితో కలిసి ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ అలీ.. ముఠా అరెస్టు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన భార్గవకుమార్, శివానంద ఈనెల 8వ తేదీన పట్టణంలోని కరూర్ వైశ్యాబ్యాంకులో నాలుగు బంగారు నకిలీ గాజులను తాకట్టు పెట్టేందుకు వెళ్లారు. పరీక్షించిన బ్యాంకు సిబ్బంది నకిలీ బంగారు తెచ్చారని నిలదీశారు. తమకు వేరేవాళ్లు ఇచ్చారంటూ వారు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయంపై బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వెంకట్ రెడ్డి బుధవారం కసాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కసాపురం రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న నిందితులను పట్టుకున్నారు. పట్టణంలో బంగారు షాపు నిర్వహిస్తున్న క్రాంతి, వేణుగోపాల్ సాయంతో నకిలీ బంగారు ఆభరణాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. లేజర్ మిషన్‌తో 30టచ్ గోల్డ్ తయారు చేసి, విక్రయించడం, తాకట్టు పెట్టడం చేస్తున్నారు. సాధారణ ప్రజలు గుర్తించలేకుండా వాటిపై హాల్ మార్క్ కూడా వేస్తున్నారు. పట్టణానికి చెందిన భార్గవ్‌కుమార్, క్రాంతి, వేణుగోపాల్, శివానంద, ఎరుకల శ్రీనివాసులు, నరేంద్ర, మహమ్మద్ జావేద్, కర్నూలు నగర వాసులు మేకల శ్రీనివాసులు, మల్లెమాల నరేష్ అరెస్టయిన వారిలో ఉన్నారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ

న్యూస్ బాక్స్

డాక్టర్ కోసం దివ్యాంగుల నిరీక్షణ



డాక్టర్ కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగులు

కదిరిఅర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సదరమ్ సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు డాక్టర్ కోసం నిరీక్షించాల్సి వచ్చింది. గతంలో మంజూరు చేసిన సదరమ్ సర్టిఫికెట్లను ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల పేరుతో బోగస్ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు తీసుకుంటున్న వారి గురించి విచారణ చేపట్టింది. ప్రస్తుతం రూ. 6వేల పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగుల ధృవపత్రాల పరిశీలనలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్యాంపు నిర్వహించారు. దీనికి అనంతపురం సర్వజన ఆసుపత్రి నుంచి రావాల్సిన డాక్టర్ సమయానికి రాకపోవడంతో దివ్యాంగులు పడిగాపులుగాయాల్సి వచ్చింది. ఉదయం 9 గంటలకు రావాల్సిన డాక్టర్ 11 గంటలకు హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే వచ్చిన దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మోనాలీసాలక్ష్మి వివరణ కోరగా.. రోస్టర్ ప్రకారం హాజరుకావాల్సిన డాక్టర్ యల్లోజీ సెలవు పెట్టడంతో, ఇస్మాయిల్‌కు బాధ్యతలు అప్పగించడంతో రావడం ఆలస్యమయిందని తెలిపారు.

ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శ్రీగిరి ప్రదక్షిణను భక్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి 7గంటలకు ప్రశాంతి నిలయం గణేశ్ గేటు వద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకం గా అలంకరించి పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ భక్తి పాటలు పాడుతూ గిరిప్రదక్షణ చేపట్టారు. గోకులం, ఎనుములపల్లి సర్కిల్, పెట్రోల్ బంక్, చింతతోపు, గోవిందపేట, శివాలయంవీధి, గోపురం రోడ్డు మీదుగా గిరిప్రదక్షణసాగి తిరిగి గణేశ్ గేటు వద్ద మంగళహారతితో ముగించారు. భక్తులకు ప్రసాదాల పంపిణీచేశారు.

కోర్టు విధుల బహిష్కరణ

కదిరి లీగల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిపై సామాజిక మాధ్యమాలలో సాగుతున్న అనుచిత ట్రోలింగ్‌ను నిరసిస్తూ కదిరి న్యాయవాదులు గురువారం కోర్టుల విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు చౌడప్ప ఆధ్వర్యంలో న్యాయవాదులు సమావేశమై తీర్మానాన్ని ఆమోదించారు. ఘటనకు నిరసనగా 10, 11తేదీ రెండు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలపడానికి తీర్మానించారు. ఈ మేరకు తీర్మానం కాపీలను సంబంధిత న్యాయాధికారులకు పంపారు. న్యాయమూర్తులను మానసికంగా కుంగతీసే చర్యలను ఖం డించారు. ఘటనలకు సంబంధించి దోషులను చట్టపరంగా కఠినం గా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అవమానకర ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యలపై మంత్రికి టీడీపీ నాయకుల వినతి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ముదిగుబ్బ, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నాయకులు గురువారం పుట్టపర్తికి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్‌బాబు, జాతీయ మానవహక్కుల కౌన్సిల్ దక్షిణ భారత రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు బాసినేని వెంగమేష్ చౌదరి, టీడీపీ నాయకులు అశ్వర్థరెడ్డి, బీజేపీ నాయకులు సోమల ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా 9వ సరిగెత్తు

ధర్మవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలోని లయన్స్ కంటి ఆస్పత్రి వద్ద 9వ సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో కాశీంస్వామి పీర్లు కొలువు తీరాయి. ఈ క్రమంలో గురువారం కాశీంస్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులు చక్కెర చదివింపులు చేయించారు.

స్థల దాత కుటుంబ సభ్యులను సన్మానించిన సీఎం



స్థల దాత రామప్ప కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు

కొత్తచెరువు, జూలై 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి ప్రిన్సిపాల్ రామప్ప స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. దీంతో రామప్ప కుటుంబ సభ్యులు పీవీ పార్వతమ్మ, పీవీ సూర్యనారాయణ దంపతులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాలువా కప్పి సన్మానించి, నంది విగ్రహంతో కూడి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు. అదే విధంగా బంగారు కుటుంబాల కోసం ప్రశాంతిగ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పీవీ రాజీవ్‌దేవ్ రూ.5లక్షలు చెక్కును సీఎం చంద్రబాబునాయుడుకు విరాళంగా అందజేశారు. ఆయనను సీఎం అభినందించారు. ప్రతి ఒక్కరు ఉన్నతంగా ఆలోచించి పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తే పేదరికం లేని రాష్ట్రంగా రూపుదిద్దవచ్చని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.



రూ.5 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న రాజీవ్‌దేవ్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే







కదిరి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట, ధర్మవరంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, ఎన్పీకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ గోపాల్‌నాయక్

కదిరి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, విలువతో కూడిన విద్య అందుతోందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలో విద్య షార్ట్‌కట్ లాంటిదన్నారు. అది భవిష్యత్‌లో సమాజంలో జీవించడానికి ఉపయోపగపడదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యలో అనేక మార్పులు తెచ్చిందన్నారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఓ నాయకుడు తనపేరుతోనే విద్యాకిట్లు, గోరుముద్ద అందించినట్లు గుర్తు చేశారు. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనేక మార్పులు తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీఎస్ శర్మ, ఎంఈఓ ఓబులరెడ్డి, ప్రభుత్వ పాఠశాల స్థల దాత ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, ప్రధానోపాధ్యాయులు లియాకత్, వెంకటా చలం, కౌన్సిలర్లు కిన్నెర కల్యాణ్, షానవాజ్, టీడీపీ నాయకులు బాహావుద్దీన్, కొమ్మినేని గంగయ్యనాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవా అనే పలికే ముగ్గురు దేవుళ్లను ఒక చోట చేర్చేలా మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించే ఆలోచన చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేకమైన ధన్యవాదాలు అని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లిలో ఉన్న మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. ఎలాంటి స్వార్థం లేకుండా మన భవిష్యత్తు గురించి, మనం బాగుండాలని కోరుకునేది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే అన్నారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించే సంస్కృతి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగేంద్రకుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఎంఈఓ గోపాల్‌నాయక్, ధనియాన్‌చెరువులో ఎంఈఓ సుబ్బిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, రియాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులున్నారు.

● గాండ్లపెంట: మండల వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గాండ్లపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలతో ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

● తనకల్లు : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. 1800 మొక్కలను విద్యార్థులకు పంపిణీ చేశారు. తనకల్లు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ లలితమ్మ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో తహసీల్దార్ షాబుద్దీన్, ఆర్ఐ అశోకచక్రవర్తి, టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బాలుర, బాలికల, ప్రాథమిక, ప్రైవేట్ పాఠశాలలలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. తల్లి పేరుతో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమాలలో మండల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నల్లమాడ : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కస్తూరిబా పాఠశాలలో ఎంపీడీఓ ఆజాద్, ఎంఈఓ వేమనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ లక్ష్మీ, మండలంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● బత్తలపల్లి: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారులు తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయచంద్ర, తుమ్మల మహబూబ్‌బాషా, శివారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు. గౌనిపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయమ్మ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు రమేష్, అశ్వనీ, వాహిదాను సన్మానించారు.

● నల్లచెరువు : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జడ్పీ ఉన్నతపాఠశాల ఎంఈఓ తిరుపాల్‌నాయక్, తహసీల్దార్ జమావుల్లాఖాన్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, డాక్టర్ అలైక్య పాల్గొన్నారు.

● తాడిమర్రి :మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని తాడిమర్రి మండలంలోని అన్ని పాఠశాలలో నిర్వహించారు. కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి, రాము ఉన్నత పాఠశాలలో కమిటీ అధ్యక్షుడు క్రిష్ణవేణి, జూనియర్ కళాశాలలో ఎంఈఓ వెంకటస్వామి, ఈఓఆర్డీ విజయ్‌శేఖర్ పాల్గొన్నారు.

● ధర్మవరం: పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లోగల శ్రీసాయికృప జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తల్లికివందనం ప్రాముఖ్యత గురించి కళాశాల కరస్పాండెంట్ డోలాపెద్దిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ భగవంతరెడ్డి,పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గాండ్లపెంట : మలమీదపల్లిలో పాల్గొన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



తనకల్లులో మాట్లాడుతున్న తహసీల్దార్ షాబుద్దీన్



నల్లమాడ కేజీబీవీలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్



తాడిమర్రిలో విద్యార్థినిని సన్మానిస్తున్న తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి



ధర్మవరంలో విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు







షిర్డీసాయిబాబాను దర్శించుకుంటున్న పరిటాల శ్రీరామ్, భక్తులకు అన్నదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, సాయినగర్‌లోని ఆలయంలో పాదదర్శనం

ధర్మవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కన గల షిర్డీసాయిబాబా ఆలయంలో ఆలయ సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బాబా పాదదర్శనానికి వేలాది మంది భక్తులు క్యూకట్టారు. సేవాసమితి ప్రతినిధులు బందనాథం సూర్యప్రకాశ్, వీరనారాయణ, రాంప్రసాద్, హేమంత్‌కుమార్, జీసీ నాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోతుకుంట, సిద్దయ్యగుట్టలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ షిర్డీసాయినాథుడిని దర్శించుకున్నారు. షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేయించారు.అన్నదాన కార్యక్రమంలో సత్యకుమార్‌యాదవ్, శ్రీరామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, రామాంజి, కిష్ట, లోకేశ్ పాల్గొన్నారు.

● బత్తలపల్లి: మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బత్తలపల్లి, రామాపురం షిరిడిసాయి బాబా ఆలయాల్లో, గంటాపురం అప్పనాయనస్వామి ఆలయంలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● తాడిమర్రి : గురుపౌర్ణమిని పర్వదినాన్ని పురస్కరించుకుని తాడిమర్రిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు కేశవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కూచి రాము, హర్ష, శ్రీనివాసులు, ఫణికుమార్, సాయి, గణేష్, భాస్కర్‌గౌడ్, పక్కీర్‌రెడ్డి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



కదిరి వాణివీధిలో ప్రత్యేకాలంకరణలో షిర్డీసాయిబాబా



నల్లమాడలో ప్రత్యేకాలంకరణలో సాయిబాబా



తాడిమర్రిలో ప్రత్యేక అలంకరణలో షిర్డి సాయిబాబా

నీటి సరఫరా కార్మికుల కన్నీళ్లు..!

● 9నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ● స్పందించని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ముదిగుబ్బ, జూలై 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు తాగునీటిని సరఫరా చేసే కార్మికుల కన్నీటి కష్టాలను సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు చెల్లించాలని ఇటీవల సమ్మె చేసినా అధికారులు స్పందించడంలేదు. పూట గడవక కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ముదిగుబ్బలోని సత్యసాయి పంప్‌హౌస్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ పథకం కింద 22 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఏడునెలల కిందట ఈ పథకం కింద ఉన్న 10 మంది కార్మికులను సత్యసాయి పథకంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం 12 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.8వేల జీతం. దాదాపు తొమ్మిది నెలలుగా బకాయిలు ఉన్నాయి. జూన్ 23వ తేదీన వేతనాలు చెల్లించాలని పంప్‌హౌస్‌లో మోటార్లు నిలిపివేసి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు సమ్మె ప్రారంభించారు. మరుసటి రోజు సంబంధిత అధికారులు కార్మికులతో మాట్లాడి వేతనాలు చెల్లిస్తామని, సమ్మె విరమించాలని హామీ ఇచ్చారు. దాంతో కార్మికులు సమ్మె విరమించి నీటి సరఫరాను పునఃప్రారంభించారు. నేటికీ కార్మికులకు జీతాలు చెల్లించలేదు. దీంతో కుటుంబాన్ని పోషించుకోలేక, ఆర్థిక కష్టాలతో అప్పులు చేసి జీవనం సాగించే పరిస్థితి ఏర్పడుతోందని కార్మికులు వాపోతున్నారు. బుధవారం నుంచి పంప్‌హౌస్‌లో మోటార్లను నిలిపివేసి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. మండలంలోని అనేక గ్రామాల్లో మొహర్రం వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో నీరు వదలకపోవడంతో పండుగ రోజు బంధువులు ఇళ్లకు రావడంతో నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ ప్రజలు వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ కింద మండలంలోని 36 గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. కార్మికులు సమ్మె ప్రాంభించడంతో గ్రామాల్లో త్రాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు సమ్మెలోకి వెళ్లిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించే విధంగా కృషి చేస్తాం.

- ప్రసాద్, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ముఖ్యమంత్రికి పుట్టపర్తిలో ఘనస్వాగతం

పుట్టపర్తి రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక్కరోజు పర్యటనలో భాగంగా పుట్టపర్తికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం లభించింది. గురువారం విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 9.30 గంటలకు శ్రీసత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకోగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ వి.రత్న, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గన కొత్తచెరువుకు వెళ్లారు.

ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తచెరువులో నిర్వహించిన మెగాపేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలసి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం రోడ్డు మార్గాన ప్రశాంతినిలయం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం సత్యసాయి విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ రత్న, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెస్ రాజు, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లగుంట్ల అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం విమానాశ్రయంలో మంత్రి లోకేశ్ జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలసి బెంగళూరు వెళ్లారు.







చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, పల్లె రఘునాథరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ రత్న, టీడీపీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తి అభివృద్ధికి చేయూతనివ్వండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వినతి

పుట్టపర్తిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించి చేయూతనివ్వాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విన్నవించారు. గురువారం కొత్తచెరువులో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్‌మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందచేశారు. నవంబరు 23న జరిగే సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా పుట్టపర్తి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొత్తచెరువు జూనియర్ కళాశాల మైదానంలో మంజూరైన ఇండోర్ స్టేడియం, బుక్కపట్నం డిగ్రీ కళాశాల, మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల వసతిగృహం వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో నిధులులేక నిలిచిపోయాయని వీటన్నింటికి నిధులు మంజూరుచేయాలని ముఖ్యమంత్రిని కోరారు. రింగ్‌రోడ్ నిర్మాణం, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి కేంద్రంగా జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరుచేయాలని విన్నవించారు. బుక్కపట్నం చెరువు కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, పుట్టపర్తిలో స్టేడియం, ఓడీచెరువులో ఆసుపత్రికి నూతన భవనాలు, పుట్టపర్తిలో జిల్లా స్థాయి ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా గుర్తించి దానిమ్మ, మామిడి, అరటి, చీనీ పండ్ల తోటల రైతులకు ప్రత్యేక రాయితీ, మార్కెట్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

పుట్టపర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు అర్బన్ ట్రాన్స్‌కో ఏఈ సాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాను పుట్టపర్తిలో విద్యుత్ లైన్ల మరమ్మతులోభాగంగా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

బాలుడిని బలిగొన్న నీటి ఆటో

కదిరి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రంలో గురువారం నీటి ఆటో కిందపడి 18 నెలల బాలుడు మృతిచెందాడు. బాలుడు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు... కాళసముద్రానికి చెందిన బాబ్‌జాన్, సునియా దంపతులకు ఇద్దరు కుమారులు, ఒకకుమార్తె ఉన్నారు. సాయంత్రం సునియా ఆటోవద్ద నీటిని పట్టుకుంటుండగా బాలుడు మహమ్మద్‌ఆనాస్ ఆటో కిందకు వెళ్లాడు. ఇది గమనించని డ్రైవర్ రాజశేఖర్ ఆటోను ముందుకు కదిలించారు. దీంతో చక్రం కింద పడి బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

తనకల్లు, జూలై10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవి పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిదండ్రిలేని చిన్నారులకు మిషన్ వాత్సల్య గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి మేఘన, ఎస్ఓ హబీదాబీ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చంద్రబాబుతోనే సుపరిపాలన



తోపుడుబండ్లను వ్యాపారులకు అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని మంత్రి సవిత అన్నారు. గురువారం వెంకటరెడ్డిపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. గ్రామస్థులు పూలమాలలతో ఆమెకు స్వాగతం పలికారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఇంటికి తిరిగి పథకాలు అందుతున్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ శ్రీరాములు, ఈశ్వర్‌ప్రసాద్, కౌన్సిలర్ గిరిశోభన్, దత్తారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు అన్నారు. గురువారం రాత్రి బుళ్ళసముద్రం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు గుండుమల తిప్పేస్వామి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. మండల కన్వీనర్ నాగరాజు, మాజీ సర్పంచు జైపాల్ పాల్గొన్నారు.



రొద్దంలో ప్రచారం చేస్తున్న నాయకులు

రొద్దం: కూటమి ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు మాధవనాయుడు కోరారు. గురువారం రొద్దం మండలం మరువపల్లి, నారనాగేపల్లి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్పయ్య, చంద్రమౌళి, నరహరి, టైలర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

సోమందేపల్లి: కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గురువారం టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సాయినగర్, మణికంఠకాలనీ, పెద్దరెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పథకాలపై వివరించారు. కన్వీనర్ వెంకటేశ్వర్లు, సిద్దలింగప్ప, సూర్యనారాయణ, నటరాజాచారి, మోహన్, కిష్టప్ప, మహేంద్ర, మద్దిలేటి సుబ్బు పాల్గొన్నారు.



గుడిబండలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

గుడిబండ: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మద్దనకుంటప్ప అన్నారు. గురువారం మద్దనకుంటలో కార్యకర్తలతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్, బాలేపల్లి రాజు, భీమరాజు, దాసప్ప, షబ్బీర్ పాల్గొన్నారు.

'కష్టపడిన వారిని టీడీపీ మరువదు'



సింగిల్ విండో చైర్మన్ నాగార్జునను అభినందిస్తున్న శ్రీనివాసులు

చిలమత్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క నాయకుడిని, కార్యకర్తను పార్టీ ఎప్పటికీ మరచిపోదని మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నాగార్జునను ఆయన గురువారం అభినందించారు. సర్పంచ్ మురళీ, నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, బేకరీ గంగాధర్, సూరి, నంజుండప్ప, గంగాధర్, శ్రీదేవి, కృష్ణమూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

13లోపు దరఖాస్తు చేసుకోండి



సిబ్బందితో చర్చిస్తున్న ఏఓ నాగరాజు

అగళి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రైతులు 13వ తేదీలోపు అన్నదాతా సుఖీభవకు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు చేసుకోవాలని వ్యవసాయశాఖాధికారి నాగరాజు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతా సుఖీభవ కింద రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ.20 వేలు రైతుల ఖాతాలో మూడు విడతలుగా జమ చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

విద్యార్థుల భవిత కోసమే మెగా పీటీఎం



సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న మంత్రి సవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

● చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు తీర్చి దిద్దడానికి మెగా పీటీఎం ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి సవిత అన్నారు. గురువారం ఆమె సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా పాఠశాల వసతులు, పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యద్వారానే సామాజిక మార్పు సాధ్యమని, కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు సౌజన్యంతో రాష్ట్రంలోని పేద విద్య సంస్థల్లో ఆదర్శంగా ఉండేలా స్కూళ్లను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు.

మనిషి విలువ పెంచే శక్తి విద్యకే ఉంది

మడకశిర టౌన్: సమాజంలో మనిషి విలువ పెంచేది ఒక్క విద్యేనని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. గురువారం పట్టణంలోని గుడిబండ కేజీబీవీలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. సీఎం చంద్రబాబు విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని గట్టి విశ్వసించడంతో పాటు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరం అయిన అన్ని సదుపాయలు కల్పించడంతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను ప్రతి విద్యార్థి సదివినియోగం చేసుకోవాలని, ప్రతి తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్లి తమ పిల్లలు గురించి అరా తీస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ మంజుళ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుజాత, ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్ పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం గురువారం వేడుకలా సాగింది. ఎస్‌ఏపీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్కేడిఆర్ జూనియర్, ఏఎస్‌కె డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, భక్తవత్సలం సమావేశం నిర్వహించారు.



పరిగిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు బ్యాండ్లతో స్వాగతం

పరిగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు, టీడీపీ నాయకులకు విద్యార్థులు బ్యాండుమేళంతో ఆహ్వానించారు. మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవిందరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ అశ్వర్థ, వేణుగోపాల్‌రావు, మూర్తి, రామక్రిష్ణ, పాళ్యం చంద్ర పాల్గొన్నారు.

చిలమత్తూరు: పిల్లలను పాఠశాలలకు పంపడంతోనే పని అయిపోయిందని అనుకోరాదని, వారి పట్ల బాధ్యతగా ఉంటూ వారి బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు బాటలు వేయాలని మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన పలు పాఠశాలల్లో జరిగిన పీటీఎం సమావేశాలకు హాజరయ్యారు.

రొద్దం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మెగా పేరెంట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నాయకులు మాధవనాయుడు, నరసింహులు, చిన్నప్పయ్య, నరహరి, ఎంపీడీఓ రాంకుమార్, ఎంఈఓ జయభాస్కర్, ఉపాధ్యాయులు మల్లికార్జున, నాగలక్ష్మీ, రత్న, గోకుల్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

మడకశిర రూరల్: పాఠశాలల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకోసం ప్రభుత్వం గురుకుల పాఠశాల,కళాశాలల్లో గురువారం మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించారు. టీడీపల్లి ప్రాథమికోన్నత పాఠశాల తొలి గురువు విశ్రాంత ఉపాధ్యాయుడు తిమ్మప్పను తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సన్మానించారు.

సోమందేపల్లి: విద్యార్థులకు దశదిశ ఇవ్వగలిగే శక్తి ఒక్క గురువుకే ఉందని సర్పంచ్ గంగాదేవి అన్నారు. గురువారం వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ వనజవాణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగళి: మండలంలోని పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కస్తూర్బా ఎస్ఓ నాగరత్నమ్మ, దాసేగౌడ్, మస్తాన్, ఆర్‌జిపల్లి గోపీ, ఇరిగేపల్లి రాఘవేంద్రరెడ్డితోపాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మెగాపేరెంట్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, జడ్పీటీసీ ఉమేష్, టీడీపీ మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు కుమారస్వామి హాజరయ్యారు.

గుడిబండ: విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల బాధ్యత ఎంతో అవసరమని ఎంపీడీఓ కేశవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మోరుబాగల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం రమణారెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని గురుకుల పాఠశాల, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఆయా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈరన్న మాట్లాడుతూ కష్టపడి క్రమశిక్షణగా చదువుకుంటే ఉన్నతస్థాయికి చేరవచ్చన్నారు. ప్రిన్సిపాల్ మైలారప్ప, గురుమూర్తి, పాండురంగప్ప, దాసిరెడ్డి, రామక్రిష్ణ, యోగానంద, నారాయణప్ప, నాగరాజు పాల్గొన్నారు.



హిందూపురంలో బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్‌డే సమావేశం పండగ వాతావరణంలో సాగింది. గురువారం పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరగ్గా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ రమేష్ హాజరై మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేనివిధంగా ఏడాదికి రెండుసార్లు సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంఈఓ గంగప్ప, పరిమళ, కౌన్సిలర్ మల్లికార్జున పాల్గొన్నారు.

పెనుకొండ: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీటీఎం కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని విద్యామందిరం అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సరస్వతి విద్యామందిరంలో గురుపౌర్ణమి పీటీఎం కార్యక్రమాలను నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 150మంది తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సుధాకర్‌గుప్త, రామక్రిష్ణ, క్రిష్ణమూర్తి, మురళి, కేదరినాథ్, జయలక్ష్మమ్మ పాల్గొన్నారు. స్థానిక బాబయ్య దర్గా సమీపంలోని బాబాఫక్రుద్దీన్ ఉర్దూపాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.



రొద్దంలో తల్లి దీవెనలు అందుకుంటున్న విద్యార్థులు



మడకశిర రూరల్ : విశ్రాంత ఉపాధ్యాయుడు తిమ్మప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులతో చాకిరీ



టేబుళ్లను మోస్తున్న విద్యార్థులు

పెనుకొండ టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులచే ఉపాధ్యాయురాళ్ల చాకిరీ చేయించారు. గురువారం మంత్రి సవిత ఆధ్వర్యంలో మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించారు ఉపాధ్యాయురాలు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో విద్యార్థులను వాటిని తీసుకురమ్మని ఆదేశించారు. పాఠశాలలో ఉన్న టేబుళ్లను తెచ్చి ఉపాధ్యాయురాళ్లకు అందించారు. పలువురు తల్లిదండ్రులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పీటీఎం(పేరెంట్స్ టీచర్ మీటింగ్) నిర్వహిస్తుంటే ఈ విధంగా విద్యార్థులచే చాకిరీ చేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



సంక్షేమ హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీసీ, ఎస్పీ, సీఎస్

పావగడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య 21వ తేదీ పావగడలో పర్యటిస్తున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సత్యవాణి తెలిపారు. గురువారం ఆమె సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.తుంగభద్ర జలాలు, తాగునీటి కోసం జేజేఎం పథకం కింద కొళాయిలు అమర్చిన విషయంపై చర్చించారు.

సమస్యలపై చర్చల్లేవ్..!

అరగంటలో ముగిసిన సర్వసభ్య సమావేశం

చిలమత్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు చర్చించకుండానే సర్వసభ్యసమావేశాన్ని అరగంటలో ముగించేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం ఎప్పటిలాగే తూతూ మంత్రంగానే సాగింది. వచ్చామా..వెళ్లామా.. అన్నట్లుగా బాధ్యతారాహిత్యంగా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఆనవాయితీగా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకవర్గంలో ఉన్న విభేదాలతో సమావేశాలు ముందుకు సాగకపోగా, ఇప్పుడేమో తమకేమి పట్టనట్లుగా పాలకవర్గం భావిస్తోంది. శాఖల వారిగా సమస్యలను చర్చించాల్సి ఉండగా వాటి గురించి పట్టించుకోకపోవడం విశేషం. ఎంపీపీ పురుషోత్తంరెడ్డితో పాటు ప్రాదేశిక సభ్యులు విఫలమవుతూ సమస్యలను చర్చించకుండానే తూతూ మంత్రంగా కానిచ్చేసి వెళ్లిపోతున్నారు.

సర్వసభ్య సమావేశం బాయ్‌కాట్

రొద్దం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీలకు గౌరవవేతనం ఇవ్వకపోతే ఎలా అంటూ సభ్యులు సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. గురువారం రొద్దం మండల పరిషత్ కార్యాలయంలో 11గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా 12గంటలకు ప్రారంభం అయింది. ఎంపీటీసీ సభ్యులకు గౌరవవేతనం ఇవ్వలేదని హాజరుకామని బయటికి వెళ్లిపోయారు. దీంతో సమావేశం శుక్రవారం 11గంటలకు వాయిదాపడింది. దీనిపై ఎంపీడీఓ రాంకుమార్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం జరిగితేనే గౌరవవేతనంపై చర్చిస్తామన్నారు. కోరంలేక సమావేశం వాయిదాపడిందన్నారు. ఎంపీపీ నాగలక్ష్మీ, జడ్పీటీసీ పద్మ, సర్పంచ్ పరమేశ్, వైస్ ఎంపీపీ హరిత, లక్ష్మి పాల్గొన్నారు.



చిలమత్తూరు: మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హిందూపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నానెప్ప నగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు సాయిబాబా స్పర్శదర్శనం చేసుకున్నారు. దర్శించుకోవడానికి జనం క్యూలో నిలబడ్డారు. సత్యనారాయణపేటలో సప్తరుషుల మధ్య సాయినాథున్ని ఉంచి పూజలు నిర్వహించారు.



అలంకరణలో సాయినాథుడు



మిట్టమీదపల్లి సాయిబాబా ఆలయం వద్ద లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

మడకశిర టౌన్: గురుపౌర్ణమి వేడుకలు పట్టణంలోని షిర్డీసాయి ఆలయంలో గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు, గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పూజల్లో పాల్గొన్నారు.



సాయినాథుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



బూడిదగడ్డపల్లిలో గురుపౌర్ణమి వేడుకలు

గోరంట్ల: మండల వ్యాప్తంగా ఆలయాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుడిదగడ్డపల్లి షిర్డీసాయి ఆలయంలో అర్చకులు నారాయణానందస్వామి, ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకాలంకరణ, భక్తిగీతాలాపన, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జీఎం సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రొద్దం: మండలంలోని ఆర్.మరువపల్లిలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం షిర్డీసాయి ఆలయంలోఉదయం నుంచే పూజలు చేపట్టారు. సాయంత్రం బాబా చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న రఘువీరారెడ్డి దంపతులు

మడకశిర రూరల్: మండలంలోని నీలకంఠాపురంలో షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస్టర్‌వీవర్స్ సీసీహరి దంపతులు బాబాకు గజమాల సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. రూ.10వేలు ఆలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. అనంతరం ఆలయంలో కమిటీవారు లడ్డూ వేలం నిర్వహించారు. ధర్మకర్త లక్ష్మీనారాయణరెడ్డి రూ.40వేలకు లడ్డూను దక్కించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న సీసీ హరి దంపతులు

పెనుకొండ: పట్టణంలోని బాబా మందిరాల్లో గురుపౌర్ణమి, వ్యాసపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణ షిర్డీగా పేరుగాంచిన షిర్డీసాయి మందిరంలో ఉదయం అర్చకులు ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు



అగళి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదానం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం



నూతన బోరును ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెనుకొండ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాగునీటికోసం 15 ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న కోనాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించిందని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం పెనుకొండ నగర పంచాయతీ కోనాపురంలో ఏళ్లుగా తాగునీటి సమస్య ఉందని గ్రామస్థులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె తాగునీటి బోరును రూ.7.5లక్షలతో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇప్పటికే బోరుబావులు తవ్వించి నీరు పుష్కలంగా పడ్డాయి. గురువారం ఉదయం బోరుబావిని ప్రారంభించారు. కమిషనర్ సతీష్‌కుమార్, శ్రీరాములుయాదవ్, చలపతి, కేశవయ్య, రామలింగ ప్రసాద్, సుబ్రమణ్యం, రమేష్ పాల్గొన్నారు.

జపానంద కంటి ఆసుపత్రికి నోటీసులు

పావగడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): శారదాదేవి కంటి ఆసుపత్రిలో జపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి చికిత్సల్లో భాగంగా 7న ఆరుగురు వృద్ధులకు ఆపరేషన్ చేయగా చూపు కోల్పోయిన ఘటనపై ఆస్పత్రికి నోటీసులు ఇచ్చారు. జిల్లా, రాష్ట్రస్థాయి వైద్యులు 14న ఆసుపత్రిని తనిఖీ చేయనున్నారని జిల్లా వైద్యాధికారి డా.చంద్రశేఖర్ తెలిపారు. ఉచిత కంటి ఆపరేషన్ పేరుతో అనుభవంలేని వైద్యులతో ఆపరేషన్ చేయిస్తే వాటికి నాణ్యతలేని లెన్స్ అమర్చడంతో కంటిచూపు పోయిందని బాధితులు వాపోయారు.